కథానిక

# తీర్పు

## మ. రా. శాస్త్రి

రుద్రాయ పాలెం మొత్తానికి రుద్రయ్యను మించిన పెద్ద, తగవరి, మోతుబరి లేడు. పాలెం అనగానే, అది మరో అగ్రహారానికి చేరివున్న పాలెంగా అర్థంచేసుకో కూడదు. రుద్రాయ పాలెం ఓ వూరు.

అన్ని వర్ణాల వాళ్లూ ఆ వూళ్ళో వున్నా రుద్రయ్యా వర్ణంది మెజారిటీ. కనుక, ఆ వర్ణంలో రుద్రయ్యా కున్నంత పెద్ద పిర్రలు మరెవరికీ లేవు కనుక, రుద్రయ్యా పెద్ద అయేడు! ఏ తగు వొచ్చినా, తుది తీర్పుకి అతడే దిక్కు. కనుక తగవరి అయేడు! ఎవరి సొమ్ము యింత వరకు అపహరించి అన్యాయం చెయ్యలేదు కనుక, మోతుబరే మరి!

అతని పెద్దరికాన్ని గురించి మాట్లాడ్డానికి లేదు! పెద్ద పిర్రలుండడం అర్హతగా భావించి, అధిక జనాభా అతడినే పెద్దన్నారు; దానికి తిరుగు లేదు.

మోతుబరి తనాన్ని శంకించలేం! అప్పు పుచ్చుకుంటే ఎగ్గొట్టేవాడో తీర్చేవాడో! అప్పుచేసే అవసరమే కలగ లేదు! అయినింట ఇల్లరికానికి వచ్చేడు. మావగారు బంగారంలాంటి రెండు చెక్కలు రాసి యిచ్చేడు. పెద్ద చెక్కని పైలాడు చేత దున్నిస్తున్నాడు. ఇంటి నామకునే వున్న చిన్న చెక్కని స్వయంగా దున్నుకుంటున్నాడు. పిల్లా పాప లేరు! అంచేత మోతుబరి తనాన్ని పరీక్షించ నక్కరలేదు.

తగవరితనం పరీక్షించాల్సిందే! తలలు నెరిసిన న్యాయమూర్తుల తీర్పులే్న ప్రజలు లెక్కచెయ్యక తూర్పారబెడుతున్నారు! పోనీ, ప్రజలు కాదు, ప్రజా నాయకులు! అబ్బ! అలాగే అందాం; నాయకులూ కాదు – నాయకురాళ్లు! సరేనా?

అవునా? అటువంటిది, రుద్రయ్యా తీర్పు అంతగా ప్రజామోదం ఎలా పొందుతూందా అని నా శంక?

శంకంటూ కలిగేక, ఎలాగో అల్లా తీర్చుకోకపోతే కడుపు ఉబ్బుతుంది కదా?

* * *

సాయంత్రం ఏడు గంటలే అయినా, ఎంతో రాత్రయినట్లుంది. అమ్మవారి గుడిగోడల మీద బూతు రాతలు కనుపించనంత చీకటి పడిపోయింది. సినిమాకి పోతూ, అంతకు రెండు గంటల ముందరే వీధి దీపాలు వెలిగించి పోయేడు పంచాయతీ గుమస్తా. అంత వరకూ వెలిగి వెలిగి అప్పుడే ఆరి పోయాయి, కరంటు పోయిన మూలంగా.

మూగనోము పట్టిన కొత్తూరి వారి కొత్తకోడలు యింటింటా బొట్లు పెట్టి, అక్షింతలు వేయించుకొని యింటి ముఖం పట్టింది. అమ్మవారి గుడి దగ్గర కొచ్చేసరికి లైట్లు పోయాయి. చీకటి.

నడుస్తూ నడుస్తూన్న కోడలు పిల్ల మూగ వ్రతం మాటకూడా మరచి కోడిపిల్లలా అరచింది. కేకలు, అరుపులు! "ఏవిటయింది?" అంటూ జనం మూగేరు.

జరిగింది చెప్పింది, – కొత్త కోడలు

ఎవడో అటు పరుగెడుతున్నాడు. చూసేరు. తరిమారు. పట్టుకున్నారు. దొరికిన వాడు నిర్భయంగా నిజం చెప్పేడు:

"యెంకటమ్మనుకుని వాటేసుకున్నా. తప్పే!"

తప్పనేస్తే, తగువాగుతుందా? నిజానికి తప్పన్నాకే, తగువు మొదలవుతుంది. కొత్తూరి వారి కొత్త కోడలు మానం, మర్యాదా మాట?

రుద్రయ్యా దగ్గరకి తగువు రానే వచ్చింది. అంతా విన్నాడు. ఆలోచించాడు. అభిప్రాయం చెప్పేశాడు. అభిప్రాయం చెప్పేడంటే, తీర్పు యిచ్చినట్లే! దానికి తిరుగులేదు.

"ఎదవ! ఎదవపని సేశాడు. ఎంత సీకటయితే మాత్తరం, సూసుకోక్కర్లేదేటి? అయినా, అయినింటి కోడళ్లు సందలడ్డా, యీదుల్లో సికార్లేటి? ఈ ఎదవ ఈదంట ఎడుతూంటే. అదే పనిగా సూడ్డంట! అది తప్పుగాదూ? అందుగ్గానీ పొరబడ్డాడేవో? లేకపోతే ఎవరి కొంగూ పట్టుకోని ఈ సచ్చినోడు ఆ యమ్మ నట్టుకున్నాడంటే, సిత్రరంగానే వుంది!"

జూరీ సభ్యులు తలకాయలు ఊపేరు!

రుద్రయ్యా వేలు విడిచిన మేనమామ కూతుర్ని మొగుడు విదిలేశాడు. పుట్టింటి కొచ్చేసింది. ఆ మొగుణ్ణి సాధిద్దావని చూసేడు రుద్రయ్యా! వాడు పోలీసు ఉద్యోగి. "గుండెట్టి కొట్టేసి, తిరుగుబాటులో కాల్పాల్సి వచ్చి, కాల్చేశా!" నంటాన్నాడు. గుండు తడిమి చూసుకుని, వచ్చేశాడు రుద్రయ్యా.

చిట్టెమ్మ చేత చిల్లర కొట్టు పెట్టించాడు, పొట్ట పోసుకుందుకు! కడుపుకోసం కొట్టు పెట్టుకుందుకు చిట్టెమ్మ ముందు వెట్టుసరి చేసింది.

"మనం చేసే అన్ని పనులూ కడుపుకోసవే(!" తప్పు లేదని, రుద్రయ్యా ధైర్యం చెప్పేక, ఒప్పేసుకుంది!

కొట్టు పెట్టేక, అందరూ వస్తారు. ఆడ-మగ, పిల్లా పెద్దా, మెతక-ముసలి – ఎవరి అవసరం వారిది కదా?

అలాగే సత్తెప్ప సిగిరెట్ల కోసం వస్తాడు. వచ్చినప్పుడల్లా, పెట్టెడు సిగరెట్లు కొంటాడు. కొన్నవన్నీ చిట్టెమ్మ ఎదురుగుండానే, కబుర్లు చెబుతూ కాల్చేస్తాడు.

సిగరెట్లు కొనుక్కుందుకు కావలసిన డబ్బూ, వాటిని తీరుబడిగా కాల్చుకుందుకు కావలసినంత కాలం సత్తెప్పకి పుష్కలంగా వున్నాయి. లేనిదల్లా, ఆ రెంటినీ చక్కగా వినియోగించడానికి కావలసిన తెలివి!

"తెలివి లేకపోతేనేం, డబ్బుంది చాలు, వయసుంది చాలు, మేం పిల్లనిస్తాం!" అంటే, "మేం పిల్లనిస్తాం" అంటూ మేకల్లా వచ్చేరు, ఆడపిల్లల తండ్రులు.

అందర్నీ హడలు కొట్టేశాడు వెంకటప్పయ్యా. ఆయన కట్నాలడగలేదు కానుక లడగలేదు!

"వెయ్యి గడపలకి బొట్టెట్టి పిలుస్తాను, పెళ్లికి! గడపకి అయిదుగుర్ని చూసుకో! అయిదు వేల మంది వస్తారు పెళ్లికి! వీరందరికీ భోజనాలు పెట్టి సమర్థించి, పెళ్లి చెయ్యి! చాలు!" అన్నాడు.

అయిదు వేల మందికి అన్నం పెట్టగల అన్నదాత కాని, కన్యాదాత కాలేదు సత్తెప్పకి. అయిదు వేల మంది

ఆకలి తీరితే తప్ప, తన ఆలి బాధ తీరేది కాదు! అంచేత అంత వరకూ అక్కడక్కడ చిరుతిరుగుళ్లు తిరిగి తన ఆలి బాధని తీర్చుకుంటున్నాడు సత్తెప్ప! వాటిని మీరు చెడుతిరుగుళ్లంటే, అనండి!

సమభావం వుంటే తప్ప, సద్భావం పుట్టదు. సత్తెప్ప — చిట్టెమ్మలకి ఒకరి మీద ఒకరికి సద్భావం కలిగింది.

నడుస్తున్న దాన్ని నడవనిస్తారా జనం? దొంగతనం. రంకుతనం ముగ్గిన పనసపండులా బయటపడి పోతాయి!

వాసన కొడుతున్నా వెంకటప్పయ్యలో ఏ చైతన్యం లేదు. రుద్రయ్యలో విపరీతమైన చైతన్యం వచ్చింది. తన చిన్న చెక్కని ఎవడో ఆక్రమించి, దున్నుకుంటే, బాధ పడ్డట్టు బాధ పడి పోయాడు. నలుగురినీ కాపలా కాయించి — పట్టించాడు. తగువు! పరిష్కారానికి రుద్రయ్య దగ్గరకే వచ్చింది. అంతా విని, అభిప్రాయం చెప్పేశాడు.

"అయ్యాడెమ్మ! ఏం దురంతం? ఇంటో కూకున్న ఆడ కూతుర్ని అల్లరి పెట్టేయ్యడవేఁ? తెగబలిసేడుస్తున్నాడు, యీ సత్తెప్ప! నా కొడుకు! మేకపోతులా ఒళ్లు బలిసిపోయింది గావాల, పొగరణిగిపోతుంది! ... నా కొడుక్క... తెగ్గొయ్యండి!"

రెండక్షరాల, లింగ భేద వచనాలను ప్రయోగించి (మీరు బూతులంటారు!) నలుగురూ నవ్వుతుండగా సెలవిచ్చేడు రుద్రయ్య.

తీర్పు అయిపోయింది!

# ఎటుచూసినా

ప్రేమ్‌శిల

అర్థం లేని
ఆకారం లేని
ఆకాశం మీద
చెమటలు కక్కుతూ రొప్పుతున్న
మబ్బులు
కింద
సిగ్గుతో అలల్లో నక్కుతున్న సముద్రాలు
అటూ యిటూ
ఎటుచూసినా
గర్భందాల్చి మృతశిశువుల్ని
ఈనబోతున్న
చెత్తకుండీలు
వంపులన్నీ కుళ్ళి కంపుకొడుతున్న
వీధుల శరీరాలు
ఎటుచూసినా
శాపనారాల శాసనాలు మోస్తున్న
మానవ కళేబరాలు
దౌర్భాగ్యానికి మరిన్ని మెట్లుగా
మారుతున్న
సజీవ అస్తిపంజరాలు
ఎటుచూసినా —

అభ్యుదయకు

అభినందనలతో
సి. యస్. మూర్తి
గిరిరోడ్, మద్రాస్ — 17.